ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

భీంపూర్ మండలం టేకిడి రాంపూర్ గ్రామానికి చెందిన కుద్మెత భుజంగరావు(52) పల్సి-బి తండా శివారు అటవీ ప్రాంతంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భుజంగరావు మద్యానికి బానిసై జనవరి 13న ఇంటి నుండి మద్యం మత్తులో వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లలో వెతికినప్పటికీ ఆచూకీ తెలియలేదు. శుక్రవారం పల్సి-బి తండా గ్రామానికి చెందిన వ్యక్తి వంట చెరుకు కోసం వెళ్లగా ఉరేసుకున్న వ్యక్తిని గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో రిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ కరుణాకర్ అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.



గుట్కా గొడవలో యువకుడు మృతి

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి గ్రామానికి చెందిన యోగేష్(21) శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం రమేష్, యోగేష్ గ్రామంలోని తెల్లకల్లు బట్టిలో కల్లు తాగారు. బయటకు వచ్చి యోగేష్‌ను రమేష్ గుట్కా ప్యాకెట్ ఇవ్వమని అడగగా యోగేష్ ఇవ్వలేదు. ఈ విషయంలో గొడవ పడ్డారు. యోగేష్‌ను రమేష్ గుండె భాగంలో పిడిగుద్దులు గుద్దడంతో స్పృహ తప్పి కింద పడిపోయాడు. వెంటనే యోగేష్‌ను ప్రయివేట్ వైద్యులకు చూపించి, మెరుగైన వైద్యం కోసం భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎండి షరీఫ్ తెలిపారు.



ఆదిలాబాద్ గడ్డపై హస్తం జెండా ఎగరాలి..!

- ఇక్కడి నుంచే ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తాం
- ఉమ్మడి జిల్లాను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తాం
- ఇంద్రవెల్లి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తుమ్మిడిహేటీ, సదర్‌మాట్, కుప్టి ప్రాజెక్టులు నిర్మిస్తామని హామీ
- తెలంగాణ పునర్నిర్మాణ సభకు భారీగా హాజరైన జనం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సరిగ్గా రెండేండ్ల క్రితం ఇక్కడే దళిత, గిరిజన దండోరా పేరిట సభ నిర్వహించాం. జనం ఇంద్రవెల్లికి కదం తొక్కి దండులా కదిలి వచ్చారు. అప్పటి సీఎం కేసీఆర్‌పై ఇక్కడ్నుంచే సమరం శంఖం పూరించాం. ఆ సమరంలో అమరవీరుల స్థూపం వద్ద ప్రతినబూనాం. ఫలితంగా డిసెంబర్ 3న అధికారంలోకి వచ్చాం. అదే సెంటిమెంటును అనుసరిస్తూ లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని కూడా ఇక్కడ్నుంచే ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగరాలని.. ఇక్కడ్నుంచే ఇందిరమ్మ రాజ్య స్థాపనకు శ్రీకారం చుడుతున్నామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు కేస్లాపూర్ నాగోబా ఆలయంలో పూజలు నిర్వహించిన సీఎం..ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి అక్కడ స్మృతివనం నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి బహిరంగ సభలో మాట్లాడారు.

ఇది పౌరుషం..పోరాట గడ్డ..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పోరాట గడ్డగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఇక్కడి మట్టిలో పౌరుషం..పోరాట పటిమ ఉందని..జల్,జంగల్, జమీన్ నినాదంతో బ్రిటీష్, రజాకార్లతో కుమురంభీం పోరాడారని గుర్తుచేశారు. రాంజీగోండ్, కుమురంభీంల పేర్లు ప్రస్తావించకుండా ఏ చరిత్ర మొదలుకాదని వ్యాఖ్యానించారు. ఈ పోరాట గడ్డ నుంచే ఇందిరమ్మ రాజ్య స్థాపనకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని ఆదివాసీ బిడ్డలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రోడ్లు, తాగునీటితో పాటు రూ.7కోట్లతో నాగోబా ఆలయం అభివృద్ధితో పాటు రూ.10కోట్ల ట్రైకార్ నిధులతో తరగతి గదుల నిర్మాణాన్ని ప్రారంభించినట్లు సీఎం తెలిపారు. గతంలో ఆదివాసీల పట్ల జరిగిన తప్పులకు క్షమాపణ చెప్పామని.. ఆనాటి అమరవీరుల కుటుంబాలకు ఇండ్లు నిర్మించేందుకు రూ.5లక్షల చొప్పున కేటాయించామని గుర్తుచేశారు. కేసీఆర్ ఈ పదేండ్లలో అడవి బిడ్డల గురించి ఒక్కసారి కూడా ఆలోచించలేదని విమర్శించారు. ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ఒక్కసారి కూడా సమీక్షించలేదని తెలిపారు. తుమ్మిడిహేటీ, సదర్‌మాట్, కుప్టి ప్రాజెక్టులు నిర్మిస్తామని, కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడుతామని భరోసా ఇచ్చారు. ప్రతి తండా,గూడేనికి తాగునీరు,రోడ్లు, ఇతరాత్ర మౌళిక వసతులు కల్పిస్తామని చెప్పారు.





భారీగా హాజరైన జనం

రానున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ పునర్నిర్మాణం పేరిట ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద కాంగ్రెస్ నిర్వహించిన బహిరంగ సభకు భారీగా జనం హాజరయ్యారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. సాయంత్రం 4గంటలకు ప్రారంభమైనా..ఉదయం 11గంటల నుంచే సభా ప్రాంగణానికి జనాలు రావడం ప్రారంభమైంది. వందలాది ఆర్టీసీ, ప్రయివేటు బస్సులతో పాటువ వేలాది ఇతరాత్ర వాహనాల ద్వారా జనం తరలివచ్చారు. సభా ప్రాంగణం వేలాది మంది జనంతో కిక్కిరిసిపోయింది. ఎండ ప్రభావం ఉన్నప్పటికీ గంటల తరబడి ఇక్కడే నిరీక్షించారు. రేవంత్‌రెడ్డి సభకు రాగానే ఒక్కసారిగా హర్ష ధ్వానాలతో చప్పట్లు కొడుతూ ఉత్సాహం కనబర్చారు. అంతకుముందు డీజే పాటలకు కార్యకర్తలు నృత్యాలు చేస్తూ ఉత్సాహం కనబర్చారు.



ప్రజల కష్టాలు తీరుస్తాం : మల్లు భట్టి విక్రమార్క, డిప్యూటీ సీఎం

ఇది వరకు తాను సీఎల్పీ లీడర్‌గా పాదయాత్ర చేసిన సమయంలో అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే వాటిని పరిష్కరిస్తామని ఇక్కడే హామీనిచ్చాం. ప్రజాప్రభుత్వం ఏర్పడింది. ఇచ్చిన మాట ప్రకారం నాగోబా ఆలయం అభివృద్ధికి శ్రీకారం చుట్టాం. తాగునీరు, ఇతరాత్ర సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషిచేస్తా. ఐటీడీఏ పునరుద్ధరణ, మహిళా సంఘాల అభ్యున్నతికి పాటుపడుతాం. త్రివేణి సంగమం, చిక్‌మాన్ ప్రాజెక్టు పూర్తిచేస్తాం. ధరణి ద్వారా భూములు కోల్పోయిన వారికి తిరిగి అప్పగిస్తాం.

ఇక్కడి నుంచే అభివృద్ధి ప్రారంభం : సీతక్క, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

ఆ రోజు పోరాట స్ఫూర్తిని ఇక్కడి నుంచే మొదలుపెట్టాం. ఆదిలాబాద్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ఇక్కడి నుంచే శ్రీకారం చుడుతున్నాం. కాంగ్రెస్ దేశంలో ఇదే రోజున ఉపాధిహామీ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా దేశానికి అన్నం పెట్టింది. కోట్లాది మందికి కూడు,గూడు, ఉపాధి లభిస్తోంది. కాంగ్రెస్ అట్టడుగు వర్గాల పక్షాల ఎల్లవేళలా నిలబడుతుంది. జిల్లా అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలి : వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

గత ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గత సీఎం జోడేఘాట్‌కు వచ్చి ఇచ్చిన హామీలు అమలు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టిసారిస్తుంది. గిరిజన, హార్టికల్చర్ విశ్వవిద్యాలయాలతో పాటు నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలి. సదర్‌మాట కెనాల్ నిర్మాణం, కడెం ప్రాజెక్టు మరమ్మతు కోసం కాంగ్రెస్ ప్రభుత్వమే రూ.5కోట్లు కేటాయించింది. ఆదిలాబాద్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో స్టాఫ్‌ను నియమించాలి. ఐటీడీఏలో ఖాళీలు భర్తీ చేయాలి. 370 జీఓను తొలగించాలి. పోడు భూముల సమస్యతో పాటు విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి.

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో శుక్రవారం గైర్హాజరైన ఉద్యోగులకు పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగులు నిత్యం విధులకు హాజరైతే సంస్థ కన్న వారి కుటుంబానికే ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్నారు. ఆరోగ్య సమస్యలుంటే ఆస్పత్రులకు వెళ్లి వైద్యుల సూచనలు పాటించి త్వరగా కోలుకునేందుకు పోషకాహారం తీసుకోవాలన్నారు. గైర్హాజరైన నలుగురు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో విడివిడిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ డీవైపీఎం బి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ శ్రీలేఖ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు పేస్కేల్ అమలును స్వాగతిస్తున్నాం

నవతెలంగాణ-నిర్మల్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో విధులు నిర్వర్తిస్తున్న ఏపీఓ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రభుత్వం పేస్కేల్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 సంవత్సరాల నుండి దీన్నే నమ్ముకుని విధులు నిర్వర్తిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వంలో సమ్మె కారణంగా మూడు సంవత్సరాలు పక్కన పెట్టడంతో ఆర్థికంగా నష్టపోయి మానసికంగా కృంగిపోయారన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, పేస్కేల్ వర్తింపజేస్తామని పొందుపరిచిందని, ఎఫ్‌ఏలకు సైతం పేస్కేల్ వర్తింపజేయాలని కోరారు.

సొంతగూటికి బీఆర్ఎస్ మాజీ సర్పంచ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గతంలో కాంగ్రెస్ పార్టీలో కొనసాగి బీఆర్ఎస్‌లో చేరి గుండి గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన సెండే దత్తు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో తిరిగి సొంతగూటికి వచ్చాడు. ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత మంది పార్టీలోకి వస్తారని అన్నారు. జిల్లాలో పార్టీ మరింత బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మసడే చరణ్, గుండి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రేపు సీఈఓ ఎంట్రెన్స్ టెస్ట్

నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 4న జరగనున్న సిఓఈ సెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. ఆదిలాబాద్ రీజియన్‌లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో 5918 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరవుతున్నారన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 4 పరీక్షా కేంద్రాల్లో 1723 మంది విద్యార్థులు, ఆసిఫాబాద్ జిల్లాలో 4 పరీక్షా కేంద్రాల్లో 1495 మంది విద్యార్థులు, మంచిర్యాల జిల్లాలో 6 పరీక్షా కేంద్రాల్లో 2700 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నట్టు పేర్కొన్నారు.

అప్రెంటిషిప్ రెండో జాబితా విడుదల

నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి సంస్థ అప్రెంటిషిప్ ఫలితాల రెండో జాబితా శుక్రవారం విడుదలైందని వీటీసీ మేనేజర్ ఇందాసింగ్ తెలిపారు. సింగరేణి వెబ్‌సైట్‌లో వెలువడిన ఫలితాలు ఉన్నాయని, లిస్టులో పేరు వచ్చిన అభ్యర్థులు స్థానిక వీటీసీలో రిపోర్టు చేయాలని ఆయన సూచించారు.

16న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు

నవతెలంగాణ - రెబ్బెన

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు(సీఐటీయూ) ఎ ఓదెలు అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో జీఎం డి రవిప్రసాద్‌కు యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలు, బొగ్గు బ్లాకుల అమ్మకానికి వ్యతిరేకంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్ తదితర సంఘాలతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అఖిల భారత స్థాయిలో కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కోలిండియాలో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ వాటాలు కేవలం 63.13 శాతం మాత్రమేనని, ఇంకో 14 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం అమ్మితే కోలిండియా ప్రభుత్వ పరిశ్రమగా ఉండదని పేర్కొన్నారు. అప్పుడు వేజ్ బోర్డులు ఉండవని, కోలిండియాలో నడుస్తున్న 160 బొగ్గు గనులను క్యాపిటలైజేషన్ క్యాపిటల్ పేరు కింద అమ్మి వేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కొత్త కోడ్‌లను పార్లమెంట్‌లో అమోదింపజేసుకొని అమలుకు సిద్ధం చేసుకుందన్నారు. సింగరేణిలో కార్మికుల సొంతింటి కల, అలవెన్సులపై ఐటీ మాఫీ, కొత్త గనులు కేటాయింపులు తదితర డిమాండ్లను సమ్మె నోటీసులో పొందుపరచడం జరిగిందన్నారు. సింగరేణిలో అన్ని యూనియన్‌లు కలిసికట్టుగా సమ్మెను విజయవంతం చేసి కార్మికుల హక్కులను కాపాడాలని పేర్కొన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల హైపర్ కమిటీ వేతనాలు, లాభాల బోనస్, ప్రమాదంలో మరణించిన వారికి రూ.15 లక్షల ప్రత్యేక ఎక్స్‌గ్రేషియా సౌకర్యాలు కల్పించాలని, 2022 సెప్టెంబర్‌లో జరిగిన సమ్మె ఒప్పందం అమలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. వీటి పరిష్కారానికి కూడా సింగరేణిలో సమ్మె చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జీవో నెంబర్ 22 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే పారిశ్రామిక బంద్‌లో సింగరేణి కాంట్రాక్టు కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణ, తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని 41గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులు గమనిస్తారని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. బాధ్యతలు తీసుకున్న ప్రత్యేక అధికారులను సన్మానించారు. ఈ





కార్యక్రమంలో ఎంపీడీఓ లింబాద్రి, ఎంఈఓ చంద్రకాంత్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి హన్మాండ్లు, పశు వైద్యాధికారులు సరోత్తం, విశ్వజిత్, సూర్యతేజ, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని కొత్తపెల్లి, తాండూర్ గ్రామపంచాయతీలో స్పెషల్ ఆఫీసర్లుగా ఎంపీఓ ప్రవీణ్ కుమార్, సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. వారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రేచిని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కొత్తపెల్లి పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

గోలేటిలో బ్యూటీషియన్ శిక్షణ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని సింగరేణి సేవా సమితి భవనంలో శుక్రవారం ఉచిత బ్యూటీషియన్ శిక్షణ తరగతులను బెల్లంపల్లి ఏరియా సేవా సమితి ఉపాధ్యక్షురాలు ఎం నలినీ నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగరేణి అంత గొప్ప వ్యవస్థ మరొకటి లేదన్నారు. ఉద్యోగులకే కాకుండా ప్రభావిత ప్రాంతాల ప్రజలకు కూడా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు వృత్తి శిక్షణలైన జ్యూట్ బ్యాగులు, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, డ్రైవింగ్ శిక్షణ తరగతులు సింగరేణి సేవా సమితి ద్వారా ఇప్పిస్తుందన్నారు. మహిళలు వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా కుటుంబానికి బాసటగా నిలవాలని కోరారు. సింగరేణి మహిళలు, పరిసర ప్రాంతాల ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తులు తయారు చేసేలా నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ప్రస్తుతం బ్యూటీషియన్ కోర్సుకు మంచి డిమాండ్ ఉందన్నారు. మహిళలు దీన్ని సద్వినియోగం చేసుకొని కుటుంబాలకు బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు భయ్య మొగిళి, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ సేవా కమిటీ సభ్యురాలు సొల్లు లక్ష్మి, కుందారపు శంకరమ్మ, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ప్రశాంత్, సేవా సమితి అండ్ కమ్యూనికేషన్ కోఆర్డినేటర్ కొండ అంజయ్య పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం నోట చిక్‌మన్ ప్రాజెక్ట్ మాట

నవతెలంగాణ-సిరికొండ

ఇంద్రవెల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పునర్నిర్మాణ సభలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మండలానికి సంబంధించిన చిక్‌మన్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో భాగంగా మండలంలో ప్రధానంగా చిక్‌మన్ ప్రాజెక్ట్ రీడిజైన్ సమస్య గురించి నాయకులు విన్నవించారు. గెలిచిన తర్వాత ఈ ప్రాజెక్ట్ రీడిజైన్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో శుక్రవారం ఇంద్రవెల్లి మండలంలో అమర వీరుల స్తూపం వద్ద నిర్వహించిన పునర్నిర్మాణ సభలో ప్రాజెక్టు గురించి సీఎం రేవంత్‌రెడ్డి ముందర ప్రస్తావించడంతో ఇక్కడి రైతులు, నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల బాగోగుల గురించి ఆలోచించి తొందరలోనే చిక్‌మన్ ప్రాజెక్ట్ రీ డిజైన్ చేసి సమస్యను తొందరగా పరిష్కరించాలని కోరారు.

కాంగ్రెస్ సభకు తరలిన జనం

ఇంద్రవెల్లి మండలంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ పునర్నిర్మాణ సభకు మండలం నుంచి భారీ ఎత్తున గిరిజనులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మండలంలో నెలకొన్న పలు సమస్యల గురించి సంబంధిత మంత్రులకు, ముఖ్యమంత్రికి పలువురు నాయకులు విన్నవించారు. ప్రధానంగా ఆదివాసీ గిరిజన గ్రామాలలో రోడ్లు, రవాణా, విద్య, వైద్యం గురించి ప్రస్తావించారు. సమస్యలను తప్పకుండా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులు శుభ్రత పాటించాలి



నవతెలంగాణ-తాంసి

విద్యార్థులు ప్రతిరోజు స్నానం చేసి శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రావ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి చర్మవ్యాధి, జ్వరం, జలుబు వంటి ఇతర రోగాలకు సంబంధించిన మందులను అందించారు. ఆరోగ్యానికి సంబంధించిన పలు సూచనలు చేశారు. ప్రతిరోజు స్నానం చేసి మరుగుదొడ్డి ఉపయోగించిన ప్రతిసారి చేతులను శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. ఉతికిన బట్టలను వేసుకోవాలని సూచించారు. జ్వరం, జలుబుతో పాటు శరీరంపై దద్దుర్లు వంటి వాటిని గమనించి ఆరోగ్య కేంద్రానికి తక్షణమే తీసుకువచ్చే బాధ్యత పాఠశాల సిబ్బందిపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ, వార్డెన్ స్వప్న, సూపర్‌వైజర్ తులసీరాం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో తుంగెడలో వైద్యశిబిరం

రెబ్బెన : తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) కాగజ్‌నగర్ డివిజన్ రెబ్బెన రేంజ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం సహకారంతో శుక్రవారం మండలంలోని తుంగెడ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని తుంగెడ నీలగిరి ప్లాంటేషన్‌లో పనులు చేయడానికి వచ్చిన వలస కూలీల సంక్షేమం దృష్ట్యా ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కూలీలకు బీపీ, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వలస కూలీలు పనిచేసే ప్రాంతంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, ఆరోగ్యపరంగా జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో డివిజినల్ మేనేజర్ శ్రావణి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుజిత్‌కుమార్, కాగజ్‌నగర్ రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మణ్, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ దుర్గం రాకేష్, డిప్యూట్ రేంజ్ మేనేజర్ దుర్గం రాజేష్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జాన్సీలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ ఆర్ ప్రవీణ్, ఏఎన్ఎంలు వనిత, తులసీ, సునీత, ఆశావర్కర్ వినోద పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | ఫిబ్రవరి 03, 2024 | www.navatelangana.com

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎనిమిది నెలలుగా బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని గిరిజన సంక్షేమ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా సీఎం పర్యటన నిమిత్తం శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మొదట మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి తమ సమస్యలు విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ నాయకులు నారాయణ, షౌకత్ హుస్సేన్, శ్రీనివాస్ ఉన్నారు.



సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఆదిలాబాద్ జిల్లా, ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సభకు కాంగ్రెస్ నాయకులు బయలుదేరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం నిర్వహించిన మొదటి బహిరంగ సభకు శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలలో అత్యధిక స్థానాలు గెలవడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు వోడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, అల్ల రవీందర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సభకు ఉమ్మడి జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి మద్దతు తెలుపడం హర్షనీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రానున్న రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. సీఎం సభకు తరలివెళ్లిన వారిలో సమ్మెట రవి, నగేష్, శనిగరపు సాయన్న, రమేష్, చందలి నర్సయ్య, పోతుగంటి సాగర్, ఛాతిరి సాగర్, మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



ఆదివాసుల ప్రాంతాన్ని అభివృద్ధి బాట పట్టిస్తాం

- సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసులు, గిరిజనుల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఆధునిక ప్రపంచానికి చేరువగా అభివృద్ధి బాటలు వేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.38 కోట్ల 20లక్షలతో చేపడుతున్న రోడ్లు, భవనాలు, అమరవీరుల స్మృతివనం అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళ శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, శాసన మండలి సభ్యులు బల్మూరి వెంకటేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జులతో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆదివాసుల ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజన ఆవాసాలకు రూ.27 కోట్ల నిధులతో రహదారులు, వంతెనల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విద్యాభివృద్ధిలో భాగంగా రూ.5 కోట్లతో ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బుగ్గారం గ్రామంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేయడం జరిగిందని, ఇంద్రవెల్లి మండల కేంద్రంలో స్మృతివనం (అమరవీరుల స్థూపం) వద్ద రూ.1 కోటి అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో గ్రామీణ తాగునీటి సరఫరా ప్రాజెక్టు కింద కెరమెరి మండలంలో రూ.60 కోట్ల వ్యయంతో ధనోరా నీటి శుద్ధి కేంద్రం పనులకు శంఖుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. అమరుల కుటుంబాలకు రూ.5లక్షలు ఇంటి స్థలం, ఇండ్ల పంపిణీలో భాగంగా ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామంలో 15 మంది అర్హులైన లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యతనిస్తూ సంక్షేమం, అభివృద్ధి కొరకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎంతో చారిత్రాత్మక ఘనత కలిగిన ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. రూ.5 లక్షలతో ఇంటి స్థలం, ఇండ్లను అమరుల కుటుంబాలకు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటు తరువాత మొట్టమొదటి సారి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపాన్ని సందర్శించి, మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆనాటి పోరాటయోధుల ఆలోచనలను ఈ ప్రభుత్వం తూచ తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, ఎస్పీ గౌస్ ఆలాం, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు విరాళం



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ప్లేట్లను పురాస్తూ మల్లవ్వ జ్ఞాపకార్థం ఇక్కడ గత 9 సంవత్సరాలుగా భౌతిక శాస్త్రం పాఠాలు బోధించే ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఇటీవల బదిలీపై పాఠశాల నుంచి వెళ్లపోవడంతో వారి అమ్మ జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు 100 ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు చక్కగా విని మంచి మార్కులతో ఉన్నత చదువులు చదివేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, జోషి, రవీందర్, రాజేశ్వర్, భోజన్న, పోశెట్టి, విద్య, పంచాయతీ కార్యదర్శి కమల్ సింగ్, విద్యార్థులు ఉన్నారు.

ఇంద్రవెల్లి సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-కుభీర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లిలో జరగనున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బహిరంగ సభకు కుభీర్ మండల కేంద్రంతో పాటు పార్డి(బి), పల్సి, మర్లగొండ, కుప్టి, సోనారి తదితర గ్రామాల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇంద్రవెల్లి బహిరంగ సభకు వెళ్లారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి సరిగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుగా ఇంద్రవెల్లిలో జరిగే తెలంగాణ పున : నిర్మాణ సభకు మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ మండల అధ్యక్షులు యువజన సంఘం సభ్యులు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాలలో తరలి వెళ్లారు. సభకు తరలివెళ్లిన వారిలో జావిద్ ఖాన్, బషీర్, బాబు, జైరాం, విలాస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలోని శాంతినగర్ గ్రామ ప్రజలతో పాటు ఆయా గ్రామాల నుంచి శుక్రవారం ఇంద్రవెల్లి భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిరుదుల లాజర్ ఉన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- సామాజిక కార్యకర్త అశోక్‌కుమార్ కయాపక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

డా.బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక కార్యకర్త రిటైర్డ్ ఇంజనీర్ అశోక్‌కుమార్ కయాపక్ అన్నారు. శుక్రవారం పిప్పల్‌ధరి గ్రామం లుంబిని బుద్ధవిహార్ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి డా. బీఆర్ అంబేద్కర్ చేసిన సేవలు ఏనలేనివని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగు జాడల్లో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిప్పల్‌ధరి మండల సాధన కమిటి అధ్యక్షులు తెలంగ్ బాపురావ్, లుంబుని బుద్ధ విహార్ కమిటీ అధ్యక్షులు తాక్సాండే గజానన్, సభ్యులు గులే మోహన్, టంకే హిరాలాల్, పుల్జాలే వార్లు, భగత్ వసంత్, పుల్జాలే ఉమాజీ, తాక్సండే భుజంగ్‌రావు, సోనజోకే లాను, భగత్ అశోక్, గేడం గణేష్, సోనజోకే రాంకిషన్ ఉన్నారు.

ఏజెన్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో ఉన్న ఏజెన్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కుమురంభీం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇంద్రవెల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ శాఖలోని ఖాళీగా ఉన్న 2,530 బ్యాగ్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడానికి ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలని అన్నారు. రాష్ట్రం ఏర్పడి 10 యేండ్లు కావస్తున్నప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ఊసేత్తడం లేదని విమర్శించారు. ఆర్టీఏ ద్వారా ఐటీడీఏలో 2,530 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇప్పటికైన ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి, గిరిజన ప్రాంతాల నిరుద్యోగులతో ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషోర్ కొరెంగ, రవీందర్, అశోక్, అజయ్, శేఖర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రారంభమైన ప్రత్యేకాధికారుల పాలన

నవతెలంగాణ-ముధోల్

గ్రామపంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గెజిటెడ్ అధికారులు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ సురేష్ బాబు తెలిపారు. మండలంలోని ముధోల్ గ్రామపంచాయతీకి జాదవ్ చందు, ఆష్టా, బ్రహ్మన్‌గాం, గన్నోర గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారిగా అజ్మీర భాస్కర్, విట్టోలి, విట్టోలి తండ, రువ్వి జీపీలకు మైసాజీ, చించాల, ఎడ్‌బిడ్, తరోడా జీపీలకు అమీర్ ఖాన్, ఎడ్‌బిడ్ తండ, చింతకుంటా, జీపీలకు రామారావు, వడ్తాల్, కారేగాం, బోరేగాంలకు ఎండీ అతికొద్దీన్, మచ్కల్, ముద్గల్, రాంటెక్‌కు సురేష్ బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రత్యేకాధికారులకు మాజీ సర్పంచులు నాయకులు సన్మానించారు.

7న రమాబాయి జయంతి వేడుకలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని కైలాస్‌నగర్ అశోక బుద్ధ విహార్‌లో నిర్వహించనున్న రమాబాయి అంబేద్కర్ 126వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రమాబాయి అంబేద్కర్ మహిళా మండలి సభ్యులతో కలిసి కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ఈనెల 7న అశోక బుద్ధ విహార్‌లో రమాబాయి అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారని, ప్రజలంతా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలనీ కోరారు. వేడుకల నిర్వాహకులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మహిళ మండలి జిల్లా అధ్యక్షురాలు శోభ తుల్జాపురే, బేబీబాయి కానిండే, అరుణ, సులోచన, కౌన్సిలర్లు వెంకన్న, దర్మపాల్ పాల్గొన్నారు.

మహిళల ఆత్మగౌరవమే ప్రభుత్వ ఉద్దేశం

- స్కూల్ యూనిఫామ్‌లు కుట్టే అవకాశం ఎస్‌హెచ్‌జీలకే ఇస్తాం
- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు చెక్కును అందజేస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మహిళలు ఆత్మ విశ్వాసంతో బ్రతకాలనేదే తమ ప్రభుత్వ ధ్యేయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ లోని నాగోబా దర్బార్‌హాల్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు మహిళలకు పావలా వడ్డీకి రుణాలు ఇచ్చారని గుర్తు చేశారు. కిరణ్ కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు జీరో వడ్డీకే రుణాలు ఇచ్చారనీ అన్నారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.12వందలు ఉందని, త్వరలో మహిళలకు రూ.500లకే ఇస్తామని తెలిపారు. స్కూల్ యూనిఫామ్‌లు కుట్టే అవకాశం స్వయం సహాయక బృందాలకే కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ బిల్లులు కూడా ఎక్కువగా వస్తున్నాయన్న సీఎం త్వరలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 1450 డ్వాక్రా సంఘాలకు సుమారు రూ.60 కోట్లకుపైగా రుణాలను సీఎం బ్యాంక్ లింకేజి కింద పంపిణీ చేశారు. ఫార్మర్ ప్రొడ్యూస్ కంపెనీ రూ.25లక్షలు, కేస్లాపూర్ నాగోబా ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.7 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు ముఖ్యమంత్రి నాగోబా ఆలయంలో నాగోబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదరిక నిర్మూలన సంస్థ, వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పథకాల అమలును ఎంపీ ఎన్నికలతో ముడి వేయడం సరికాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ గెలిచితీరాలని ప్రజలను మభ్యపెడుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. శుక్రవారం స్థానిక మహాలక్ష్మివాడలోని భవాని గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్ 9 నుంచి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ మాట మారుస్తూ పార్లమెంట్ స్థానాలు గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి ప్రజలతో ఓట్లు వేయించుకొని, మళ్లీ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని మాట్లాడటం ఎంతవరకు సమంజసమని అన్నారు. ప్రజలు నిరుత్సాహ పడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు అందే వరకు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా వివిధ కమిటీలు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. బెదిరింపులు ప్రలోభాలకు బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడరని, తమ పార్టీ తెలంగాణ అస్తిత్వం కోసం ఆవిర్భవించిన పార్టీ అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో లక్ష అరవై వేల ప్రభుత్వ ఉద్యోగాలు, 18 లక్షల ప్రయివేటు ఉద్యోగాలుతో పాటు ఆలయ నిర్మాణాలు, చర్చీలు, మసీదులు నిర్మించామని గుర్తు చేశారు. విద్య వైద్యం రోడ్లపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కాంగ్రెస్ పార్టీలో ప్రజల కష్టాలు తీవ్ర రూపం దాల్చుతున్నాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పట్టణ అధ్యక్షులు అజయ్, మైనార్టీ నాయకులు సలీం, బీసీ సెల్ అధ్యక్షులు దాసరి రమేష్, మహిళా నాయకురాలు బోడగం మమత, సంద నర్సింగ్, భూమన్న, సంజయ్, కుమ్ర రాజు, గోలి శంకర్, సాయి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

సీఎంను కలిసి సమస్యలను విన్నవించిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని ఆదిలాబాద్ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ కోరారు. ఈ విషయమై శుక్రవారం ఇంద్రవెల్లి పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఇంద్రవెల్లిలో చేపట్టిన పలు అధికార కార్యక్రమాల్లో సీఎంతో కలిసి పాల్గొన్నారు. అంతకుముందు సీఎంను శాలువాతో సత్కరించారు.

ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్ట్‌కు సహకరించాలి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ లోని ప్రతిపాధిత ఆర్‌ఓబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జ్) నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ కాకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం చొరవ చూపి భూసేకరణకు నిధులు విడుదల చేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో ఉడాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సుముఖంగా ఉందని గత ప్రభుత్వానికి కేంద్రం ఎన్నిసార్లు ప్రపోజల్స్ పంపిన స్పందించలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ముందడుగు వేయాలన్నారు. 2018లో పూర్తయి వందల ఎకరాల్లో రైతులకు నీరందించాల్సిన కోరట, చనాక బ్యారేజీ నిధుల కొరతతో పనులు నత్తనడకన నడుస్తున్నాయని తెలిపారు. ఇక్కడ కూడా పేదల భూములు ముంపుకు గురవుతున్నాయన్నారు. వారికి న్యాయం చేసి భూసేకరణకు నిధులు అందించాలని కోరారు.

రిమ్స్‌కు నిధులు కేటాయించాలి...

రిమ్స్‌లో మెరుగైన వైద్యసేవలు అందించడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. పట్టణంలోని రైతుబజార్‌ను రెన్యువేట్ చేసి పట్టణంలోని వివిధ కూడళ్లలో ట్రాఫిక్ సమస్యకు మూల కారణమైన వీధి వ్యాపారులను రైతుబజార్‌లోకి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. రైతుబజార్‌ను రెన్యువేట్ చేసేందుకు నిధులు విడుదల చేయాలన్నారు.

ధరణి ఆపరేటర్లను ఆదుకోవాలి...

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి వ్యవస్థను నెలకొల్పిందని కానీ ధరణి ఆపరేటర్ల కనీసం వేతనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. వారందరినీ ఆదుకొని వారి వేతన బకాయిలు చెల్లించాలని అన్నారు. స్థానికంగా ఎన్నో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలియజేశారు. వాటి పరిష్కారానికి సహకరించాలని ఈ సందర్భంగా సీఎంను కోరారు.

పదవీ విరమణ పొందిన సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని నాగల్‌కొండ గ్రామపంచాయతీలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పదవీ విరమణ పొందిన సందర్భంగా శుక్రవారం గ్రామంలో నాయకులు శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సునీత నారాయణ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు నేనెప్పుడూ అండగా ఉంటానని, మంచి పని చేయడంలోని ఆనందం ఉంటుందని అన్నారు. చేసిన మంచి పనులు చిరస్థాయిగా గుర్తుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కళావతి ఉత్తం, ఉపసర్పంచ్ అజ్జు, మాన్కు పటేల్, యాదవ్‌రావ్, ముకుంద్‌రావ్, మారు పటేల్, ఇస్రు పటేల్, బంజారా యువసేన మండల అధ్యక్షుడు జాదవ్ దత్త, సర్వర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులను నిరాశపర్చిన బడ్జెట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేసిందని టీఎస్‌యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేతన జీవుల ఇన్ కం టాక్స్ స్లాబులను సవరించకపోవడం, ఐటి పరిమితిని పెంచకపోవడం, కొత్త రిజీమ్‌లో మినహాయింపులకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లనున్నదన్నారు. కార్పొరేట్ల ఐటీ రేటును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించడం వల్ల ఈ ప్రభుత్వం ఎవరి పక్షం వహిస్తున్నదో అర్థం చేసుకోవచ్చన్నారు. మరోపక్క విద్యారంగానికి నిధులు తగ్గించడం వల్ల ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమయ్యే చర్యలను వేగవంతం చేసినట్లయిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగులకు మేలు చేకూర్చేలా బడ్జెట్ సవరణలు చేయాలని, విద్యా వైద్యానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానించిన గ్రామస్తులు



నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామంలో గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని శుక్రవారం గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు ప్రేమ్‌దాస్ సర్పంచ్ అందించిన సేవలను ఉద్దేశించి మాట్లాడారు. సర్పంచ్ పదవిలో ఐదు సంవత్సరాలు పాఠశాలకు విశిష్ట సేవలు అందించారని అన్నారు. గ్రామ ప్రథమ పౌరునిగా గ్రామాభివృద్ధికి కృషి చేసినందుకు సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న, ఉపసర్పంచ్ కొండవేని ఎల్లయ్య, వార్డు సభ్యులకు ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పదవి కాలంలో వారికి ఎంతగానో సహకరించిన గ్రామస్తులకు, అధికారులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇకముందు కూడా గ్రామ అభివృద్ధిలో సహకరిస్తానని ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామ ప్రజలకు తమ విశిష్ట సేవలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వంశీ, పంచాయతీ కార్యదర్శి బచ్చు మల్లేష్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ రెంకల రాజన్న, కొప్పుల భూషణ, రేషన్ డీలర్ ప్రసాద్, అంగన్‌డీ టీచర్స్ హేమలత, పద్మ, ఆశ వర్కర్ విజయ, అంజన్న, శేఖర్, మహేష్, రాజు, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | ఫిబ్రవరి 03, 2024 | www.navatelangana.com

7న జెండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి



తిర్యాణి మండలం గడలపల్లి గ్రామంలో ఈనెల 7న పాహండీ పారికుపార్ లింగోకట్ ముండ జెండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మాడావి భరత్ భూషణ్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాడవి రఘునాథ్, సిడాం జగనాథ్ రావు, మాజీ సర్పంచ్ కుమురం నానేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందూర్ ఆనంద్ రావు, సిడాం భీంరావు, సెడ్మకి తుకారాం, జైనూర్ నాయకులు మండాడి లింగు, ఆనంద్ రావు పాల్గొన్నారు.

వీడియోగ్రాఫర్‌కు ఆర్థిక చేయూత

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



పట్టణంలోని ఓల్డ్ కాలనీకి చెందిన వీడియోగ్రాఫర్ సాయికి కాగజ్‌నగర్ ఫోటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ. 23 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మంచిర్యాలలో ఓ ప్రోగ్రాం ముగించుకుని కాగజ్‌నగర్‌కు తిరిగి వస్తున్న క్రమంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన బైక్ ఢీ కొనడంతో సాయికి తీవ్రగాయాలయ్యాయని తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో కాగజ్‌నగర్ ఫోటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు తమకు తోచినంత డబ్బులు జమచేసి అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఫోటో వీడియోగ్రాఫర్స్ సభ్యులు పాల్గొన్నారు.

బినామీ డీలర్లకు చెక్..!

- రేషన్ షాపుల్లో అధికారుల విస్తృత తనిఖీలు
- 7 షాపుల్లో వేరే వారే కొనసాగుతున్నారని గుర్తింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రేషన్ దుకాణాల్లో కొనసాగుతున్న బినామీ డీలర్ల ఏరివేతకు రంగం సిద్ధమైంది. రేషన్ దుకాణం ఒకరి పేరుపై ఉ ంటే.. మరొకరు నడుపుతూ డీలర్ గా చెలామణి అవుతున్నారు. అలాంటి వారిపై కొరడా ఝుళిపించేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. రాష్ట్ర పౌరస రఫరాల శాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొన్ని రోజులుగా రేషన్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తు స్టాక్‌తో పాటు దుకాణం ఎవరి పేరు మీద ఉంది. ఎవరు కొనసాగిస్తున్నారే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఏడు మండలాల్లోని దుకాణాల తనిఖీ చేయగా 7 షాపుల్లో బీనామీ వారే ఉన్నారు. అంతే కాకుండా బీనామీలుగా ఉన్న వారికి సస్పెండ్ చేస్తూ పంపిణీ బాధ్యతలను ఇతర షాపులకు అందించారు.

జిల్లాలో 314 రేషన్ దుకాణాలు

జిల్లాలో 314 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఈపాస్ ద్వారా 286, రిజిస్ట్రార్ ద్వారా 28 దుకాణాలున్నాయి. ప్రస్తుతం 1, 39, 784 రేషన్ కార్డులున్నాయి. ఇందులో అహార భద్రత కార్డులు లక్ష 26 వేల 706 కార్డులున్నాయి. 13058 అంత్యోదయ కార్డులు, 20 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. అంత్యోదయ కార్డు ఉన్న కుటుంబానికి 35 కిలోలు, అన్నపూర్ణ కార్డు ఉన్నవారికి 10 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తున్నారు. జిల్లాలో రేషన్ లబ్దిదారులకు ప్రతినెలా బియ్యాన్ని కేటాయిస్తున్నారు. అయితే కొన్ని రేషన్ దుకాణాలను బినామీలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బినామీ పేర్లతో నిర్వహిస్తున్న రేషన్ దుకాణాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్న అధికారులు నెలవారీ స్టాక్ వివరాలపై కూడా ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ దుకాణాల్లో ప్రతీ నెల 1 నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే కొన్ని దుకాణాల్లో నిర్ణీత సమయంలో లబ్దిదారులకు బియ్యం ఇవ్వకపోవడంతో తరచూగా ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై కూడా అధికారులు విచారణ చేపడుతున్నారు. అందులో భాగంగానే ప్రతి దుకాణంలోని స్టాక్‌ను ఎంఎల్ఎస్ పాయింట్ రికార్డులతో పోల్చిచూస్తున్నారు. కొన్ని చోట్ల ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సకాలంలో రేషన్ దుకాణాలకు బియ్యం చేరుకోకపోవడంతో పంపిణీ ఆలస్యం అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిని అధిగమించేందుకు అధికారులు చర్యలు చేపట్టే అవకాశం ఉంది.



వాంకిడిలో రేషన్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

జిల్లాలో విస్తృత తనిఖీలు

రేషన్ డీలర్లపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లాలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే జిల్లాలోని కాగజ్‌నగర్ కేంద్రంలో మూడు, వాంకిడిలో రెండు, పెంచికలపేటలో ఒకటి, జైనూర్‌లో ఒకటి, బెజ్జూర్‌లో ఒకటి చొప్పున కేవలం జనవరి నెలలోనే అధికారులు కేసులు నమోదు చేశారు. అయితే దీనిలో నిల్వల తేడా ఉన్న చోట కూడా కేసులు నమోదు చేశారు. బీనామీలుగా గుర్తించి వారిని సస్పెండ్ చేస్తూ ఇతర షాపులకు బాద్యతలను అప్పగించారు.

లబ్ధిదారులకు రేషన్ అందే విధంగా చర్యలు

తారామణి, జిల్లా సివిల్ సప్లై అధికారిణి

జిల్లాలో లబ్దిదారులకు రేషన్ అందే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మాకు ఎప్పటికప్పుడు వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తూ అక్రమాలను అరికడుతున్నాం. ఏదైనా ఫిర్యాదులు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావలి. బీనామీలు రేషన్ దుకాణాలు నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

సులభ్ కాంప్లెక్స్ మంజూరు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్ నూతన మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా భాధ్యతలు స్వీకరించిన అంజయ్యకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన మున్సిపల్ పరిధిలో సులభ్ కాంప్లెక్స్ మంజూరు చేయాలని, అదే విధంగా కూరగాయల మార్కెట్ పరిధిలో నిర్మించిన నూతన కాంప్లెక్స్‌ను ప్రారంభించాలని కోరారు. మేజర్ గ్రామపంచాయితీని మున్సిపాలిటీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతే కాకుండా కూరగాయల మార్కెట్ పరిధిలో నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్‌ను నేటి వరకు కూడా ప్రారంభించలేదన్నారు. దీని వల్ల మార్కెట్‌లో వచ్చే ప్రజలతో పాటు వ్యాపారస్తులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడం లేదన్నారు. కనీసం నూతన మున్సిపాలిటీలోనైన ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గుడిసెల కార్తిక్ పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జాదవ్ రాజేందర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఈ నెల 16న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జాదవ్ రాజేందర్ కోరారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లోని లేబర్ కార్యాలయంలో శుక్రవారం లేబర్ అధికారికి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులు పాల్గొంటారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ సమ్మెకు



నిర్ణయించాయన్నారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉద్యోగ, సంఘాలకు అనుబంధ యూనియన్‌గా ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మెతో పాటు గ్రామీణ బంద్‌లో కార్మికులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలకిషన్, జిల్లా కోశాధికారి ఆనందరావు, కమలాకర్, రామచందర్, రవి సదయ్య పాల్గొన్నారు.

పూలే దంపతుల ఆశయ సాధన కోసమే సత్యశోధక వివాహాలు



కెరమెరి : మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల ఆశయ సాధన కోసమే సత్యశోధక వివాహాలు జరిపిస్తున్నామని మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. శుక్రవారం మండలంలోని బారేమోడీ గ్రామంలో జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి సత్యశోధక వివాహ పద్ధతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలీకులస్తులతో పాటు బహుజన కులాలన్నీ మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే దంపతులు స్థాపించిన సత్యశోధక సమాజ నియమాలకనుగుణంగా వివాహాలు జరుపుకొని ఆదర్శంగా నిలవాలన్నారు. పూలే ఆశయ సాధన కోసం మాలీ ప్రజలు కృషి చేయాల్సిన అవసరముందని తెలిపారు. సత్యశోధక నియమాలను అనుసరించినపుడే సామాజిక న్యాయం, ఎస్టీ హోదా లభిస్తుందన్నారు. తన కుమారుడు కార్తీక్ వివాహం కూడా 2022లో సత్యశోధక పద్ధతిలోనే జరిపించానని, ఈనెల 25న ఆదిలాబాద్‌లో తన కూతురు సుహర్షా రాణి పెళ్లి కూడా సత్యశోధక పద్ధతిలోనే జరిపిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం మండల అధ్యక్షుడు కావుడే తులసిరాం, కావుడే శ్యామ్ రావు, మనోహర్, శ్రావణ్, శంకర్, బారెమోడీ గ్రామ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

ఓపెన్ తరగతులకు హాజరు కావాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయణ కేంద్రంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు సెమిస్టర్ తరగతులకు హాజరు కావాలని కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు ఈ నెల 4, 11, 25, మార్చ్ 3, 10 తేదీల్లో అధ్యయన కేంద్రంలో నిర్వహించనున్న తరగతులకు విధిగా హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ 9866398678, 9494314314, 7382929651లను సంప్రదించాలని సూచించారు.

రేపు జిల్లాకు హైకోర్టు న్యాయమూర్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 4న జిల్లాకు హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద రానున్నారని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ భవన సముదాయంలో మెగా వైద్య శిబిరం, న్యాయ అవగాహన శిబిరాలను ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ బాధితుడికి అప్పగింత

నవతెలంగాణ-వాంకిడి

మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనగొంది గ్రామానికి చెందిన ఆత్రం తుకారాం రూ.10 వేల విలువ గల మొబైల్ ఫోన్‌ను గత నెల క్రితం పోగొట్టుకొని వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో బాధితుడి వివరాలు నమోదుచేసి బ్లాక్ చేయగా తాజా టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను గుర్తించి శుక్రవారం తిరిగి బాధితుడు తుకారాంకు అప్పగించారు. ఎవరైన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన ఫోన్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్లో నమోదు చేయడంతో ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు కోరారు. ఎవరికైన మొబైల్ ఫోన్‌లు, అనుమానిత వస్తువులు, ఇతర విలువైన వస్తువులు దొరికితే సమీప పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై పోశెట్టి, కానిస్టేబుల్ ధన్‌రాజ్, హోంగార్డు బలిరాం పాల్గొన్నారు.

ఎట్టకేలకు నెరవేరిన 63 ఏండ్ల మున్సిపాలిటీ కల

- కాగజ్‌నగర్ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు
- 20వార్డులతో నూతన మున్సిపాలిటీ ఏర్పాటు

నవ తెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా నూతన జిల్లాగా కుమురం భీం ఆసిఫాబాద్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అయినప్పటికీ మున్సిపాలిటీగా మారకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందని అప్పటి ప్రభుత్వం భావించి మున్సిపాలిటీగా ప్రకటించిన విషయం తెలిసిందే. 1/70 చట్టం పరిధిలో ఉండడం పాలనాపరమైన ఇబ్బందులతో గవర్నర్ అనుమతి అవసరమైంది. దీనితో మున్సిపాలిటీగా ప్రకటించి మూడున్నర సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఆదిశగా అడుగులు పడలేదు. గత సంవత్సరం జనవరిలో 1/70 చట్టం అమల్లో ఉన్న రాజంపేటను జీపీగా మార్చడానికి సంబంధించిన జీఓ విడుదల చేయగా ఆసిఫాబాద్ మున్సిపాలిటీపై మాత్రం పూర్తి ఉత్తర్వులు విడుదల కాలేదు. గత వర్షాకాల సమావేశాల్లో అప్పటి సీఎం కేసీఆర్ మాట్లాడుతూ 2024 ఏప్రిల్ 1 నుండి ఆసిఫాబాద్ మున్సిపాలిటీ అవుతుందని ప్రకటించారు. పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ జిల్లా నాయకులు రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో రెండు నెలల ముందుగానే ఫిబ్రవరి 1 నుండి మున్సిపాలిటీగా ప్రకటిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. పట్టణ ప్రజల 63 సంవత్సరాల మున్సిపాలిటి కల నెరవేరినట్లు అయింది.

ఇది ఆసిఫాబాద్ చరిత్ర..

1913 నుంచి 1940 వరకు జిల్లా కేంద్రంగా కొనసాగిన ఆసిఫాబాద్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత జిల్లాల పునర్విభజనలో భాగంగా రెండోసారి కొమురం భీం జిల్లా పేరుతో జిల్లా కేంద్రంగా ఏర్పడింది. నిజాం కాలంలో జిల్లా కేంద్రంగా వెలుగొందిన ఆసిఫాబాద్ 1940లో జిల్లా కేంద్రం ఆదిలాబాద్‌కు తరలిపోయింది. అయితే జిల్లా కేంద్రం తరలి పోయినప్పటికీ 1961 వరకు పురపాలక కేంద్రంగా కొనసాగింది. ఆ తర్వాత కాగజ్‌నగర్‌ను మున్సిపాలిటీగా మార్చడంతో ఆసిఫాబాద్ పట్టణాన్ని మేజర్ గ్రామ పంచాయతీగా మార్చారు. తాజాగా 2019లో ప్రభుత్వం ఆగస్టు 2న నూతన మున్సిపాలిటీగా ఆసిఫాబాద్ ప్రకటించినప్పటికి కార్యరూపు దాల్చలేదు. తర్వాత రాజంపేటను గ్రామపంచాయతీగా మార్చడంతో మున్సిపాలిటీకి దారులు తీర్చుకోగా తాజాగా కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో గురువారం మున్సిపాలిటీగా ప్రకటిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

మున్సిపాలిటీగా మారితే రూపురేఖలు మార్పు

ప్రస్తుతం ఆసిఫాబాద్ మేజర్ గ్రామపంచాయతీలో రాజంపేట, జనకాపూర్, వైఎస్ఆర్ నగర్, ఆర్ఆర్ కాలనీ వరకు విస్తరించి ఉంది. రాజంపేటను నూతన గ్రామ పంచాయతీగా రూపొందిస్తూ గతంలోనే జీఓ విడుదల కాగా తాజాగా గూడవల్లి గ్రామపంచాయతీని కలుపుకొని ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఉత్తర్వులు విడుదల చేశారు. దీనితో ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి విస్తరించిన ప్రాంతంతో పాటు జూబ్లీ మార్కెట్, టీఆర్ నగర్, పొట్టి శ్రీరాములు చౌక్ వరకు ప్రధాన రహదారితో పాటు రాజంపేట ప్రాంతంలోకి రానుంది. దీనితో ఆసిఫాబాద్ ముఖచిత్రం మారుతుంది.

కాగజ్ నగర్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

గురువారం వరకు మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్ మునిసిపాలిటీగా మారడంతో పాటు కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి ఉమర్ హుస్సేన్ నుండి అంజయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.



జిల్లా కలెక్టర్‌ను కలిసి పూలమొక్కను అందిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ అంజయ్య



ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయం

ఆశ్రమ పాఠశాలల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి

నవతెలంగాణ-బెజ్జూరు

మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలో హాస్టళ్ల డైలీవేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్, ఆశావర్కర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ మండలకేంద్రంలోని రైతువేదికలో ఆదివారం ఉదయం 11 గంటలకు సీఐటీయూ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి హాస్టల్స్ డైలీవేజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, గ్రామ పంచాయతీ, ఐకేపీ, మిషన్ భగీరథ, మధ్యాహ్నభోజన పథకం కార్మికులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలన్నారు. రెండో ఏఎన్ఎంలు, 108, 104 పైలెట్లు, టెక్నీషియన్‌లు, ప్రభుత్వ ఆస్పత్రి శానిటేషన్ సిబ్బంది, హమాలీ, భవన నిర్మాణ కార్మికులు, గ్రామీణ ఉపాధిహామీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, పశుమిత్రులు, ఆరోగ్యమిత్రులు, గోపాల మిత్రులు, ఐకేపీ కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర అన్ని రంగాల కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణనూ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వర్కర్స్ ఇందు, సునీత, సుశీల, పోసుబాయి, దుర్గుబాయి, ఆశాలు వైశాలి, సునీత, నాగమణి పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదల తొలగింపు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని అర్లీ గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపుల ముళ్ల పొదలను ఎస్సై సాగర్ పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తొలగించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నందున ఎస్సై సాగర్ తమ సిబ్బందితో కలిసి ముళ్లపొదలను తొలగించారు.



ముళ్ల పొదలను తొలగిస్తున్న పోలీస్ సిబ్బంది, సభ్యుడు కృష్ణమాచారి

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

- జాతీయ హరిత దళం కోఆర్డినేటర్ విద్యాసాగర్



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని, విద్యార్థుల్లో పర్యావరణం పట్ల స్పృహని కల్పించినప్పుడే అది సాధ్యమవుతుందని జాతీయ హరిత దళం కోఆర్డినేటర్ విద్యాసాగర్ అన్నారు. జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో శుక్రవారం సర్ సిల్క్ ప్రాథమిక పాఠశాలలో నేచురల్ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. జాతీ ఎదుర్కొంటున్న సమస్యల్లో పర్యావరణ సమస్య మొదటిదన్నారు. విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించడానికే నేచురల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ మాట్లాడుతూ 8 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఐదుగురు గ్రీన్ టీచర్స్, ఐదుగురు ప్రధానోపాధ్యాయులు క్యాంపులో ఉంటారని, మొదటి రోజు కృత్రిమప్లాంటేషన్స్, వివిధ జీవకోటి గురించి అవగాహన కల్పిస్తారని, రెండవ రోజు వన్య ప్రాణులు, సహజ అటవీ సంపదపై అవగాహన కోసం అడవులను సందర్శన ఉంటుందన్నారు. మూడో రోజు పక్షుల పరిశీలన, సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి రమాదేవి, డిప్యూటీ రేంజ్ అధికారి రమ, శశిధర్ అటవీ సంపద, పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి ఉదయ బాబు, నోడల్ అధికారి దేవాజి, ప్రధానోపాధ్యాయులు శ్రీలత, వరలక్ష్మి, అనురాధ, ప్రమీల రమాదేవి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అబీద్ అలి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | ఫిబ్రవరి 03, 2024 | www.navatelangana.com

నిరుపేద కుటుంబానికి యువరాజ్యం యూత్ చేయూత

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కోమటిచేను గ్రామానికి చెందిన రత్నం ధర్మయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో దినకర్మకు యువరాజ్యం యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం కుటుంబానికి 25 కిలో బియ్యం, పది కిలోల చికెన్, నిత్యావసర సరుకులను అందించారు. రానున్న రోజుల్లో సైతం కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువ రాజ్యం యూత్ అధ్యక్షుడు జనగామ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కిరణ్, సుధాకర్, గణేష్, శేఖర్, దినేష్, సురేష్, బిక్కు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని రొట్టెపల్లి గ్రామ పంచాయతీ కొత్త గూడెం గ్రామానికి చెందిన చిక్రం రాజును కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు అల్క రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మల్కేపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాజు ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొని తన సొంత గ్రామానికి వచ్చిన సందర్భంగా సన్మానించారు. మారుమూల పేద గిరిజన బిడ్డ రాజు ఢిల్లీ వేడుకల్లో పాల్గొనడం గొప్పవిషయమని అన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో నీల్వాయి విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-వేమనపల్లి

సాధన గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నస్పూర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల నీల్వాయి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో క్రీడా స్ఫూర్తిని చాటుతూ 21 పథకాలు కైవసం చేసుకున్నారని ప్రధానోపాధ్యాయులు గిరిధర్ రెడ్డి, వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు డా.మల్లేష్ తెలిపారు. 600, 400 మీటర్ల పరుగు పందెంలో వశాఖ రజిత తృతీయ స్థానం, 600 మీటర్ల పరుగు పందెంలో చింతల మహేశ్వరి ద్వితీయ స్థానం, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో ప్రియశ్రీ ద్వితీయ స్థానం, 300 మీటర్ల పరుగు పందెంలో నికాడి హర్షిత్, 100 మీటర్ రిలే పందెంలో అల్వియా మహవీన్, చింతల మహేశ్వరి, ఓలా స్నేహలత, వశాక రజిత తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. నికాడి సహదయ, కోడూరి నేహస్విత, అదే మనస్విత, కొట్రంగి అనుష ప్రథమ స్థానం, నికాడి రాహుల్, రాజశేఖర్, సొండ్ల అనిల్, ఎండీ నదీమ్ ఖాన్ తృతీయ స్థానం, శివశంకర వరప్రసాద్, మానపల్లి అశ్వంత్, చిలుకూరి నవీన్, అనిల్ కుమార్ తృతీయ స్థానాలు సాధించినట్లు పేర్కొన్నారు. విజేతలను ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, క్రీడా పోషకులు అభినందించారు.

జోనల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన కలమడుగు విద్యార్థి



నవతెలంగాణ-జన్నారం

లక్సెట్టిపేట శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి టాలెంట్ టెస్టులో మండలంలోని కలమడుగు జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎల్యాసి రఘు మంచి ప్రతిభను కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ నాలుగు మండలాలకు సంబంధించిన విద్యార్థులకు లక్సెట్టిపేట పట్టణంలో సైన్స్ సోషల్ మాథ్స్ సబ్జెక్టులలో జోనల్ స్థాయి టాలెంట్ పోటీ నిర్వహించారు. అందులో రఘు మొదటి స్థానంలో నిలిచారని ఆ పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళి తెలిపారు. రఘును ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అభినందించారు.

నేడు జాతీయ విపత్తు నివారణ బలగాల అవగాహనా సదస్సు

నవతెలంగాణ-లక్సెట్టిపేట

లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో జాతీయ విపత్తు బలగాలతో అవగాహన సదస్సు ఉంటుందని లక్సెట్టిపేట తహసీల్దార్ రాఘవేంద్రరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన సదస్సును శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం అవగాహన కలించనున్నారు. ఇందులో భాగంగా జాతీయ విపత్తు నివారణ అధికారులు సిబ్బంది వచ్చి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. విపత్తు జరిగిన సమయంలో పాటించాల్సిన చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తారని తెలపారు. అగ్నిప్రమాదం కానీ, వరద కానీ వచ్చినపుడు త్వరిత గతిన తీసుకోవాల్సిన చర్యలు గురించి ప్రాక్టికల్ గా వివరిస్తారన్నారు. ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండలంలోని ఆయా సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్స్ మరమ్మత్తుల నేపథ్యంలో శనివారం ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని లక్సెట్టిపేట ఏఈ గణేష్ తెలిపారు. వెంకట్రావుపేట ఫీడర్ పరిధిలో వెంకట్రావుపేట, చందారం ఫీడర్ పరిధిలో చందారం, రంగపేట, హనుమంత్ పల్లి, మోదెల ఫీడర్‌లో గంపలపల్లి, మోదెల, బలరావుపేట ఫీడర్‌లో బాలరావుపేట, గుల్లకోట ఫీడర్‌లో సూరారం, గుల్లకోట గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంగ్లీష్ ఉచిత శిక్షణ తరగతులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా పరిసర గ్రామాల సింగరేణి ఉద్యోగులు భూ నిర్వాసితుల మహిళలకు డిప్లమా కంప్యూటర్ అప్లికేషన్, స్పోకెన్ ఇంగ్లీష్ ఉచిత శిక్షణ తరగతులకు ఆహ్వానిస్తున్నట్లు పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాం సుందర్ శుక్రవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. కంప్యూటర్ తరగతులు మాయా కంప్యూటర్స్ మందమర్రి మార్కెట్, స్పోకెన్ ఇంగ్లీష్ సింగరేణి హై స్కూల్ యోగా కేంద్రం మందమర్రిలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవాల్సిన వారు ఎస్ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు-2, తండ్రి లేదా భర్త సింగరేణి ఐడెంటిటీ కార్డు లేదా జీతం చిట్టి జిరాక్స్‌లతో జనరల్ మేనేజర్ కార్యాలయం పర్సనల్ డిపార్ట్మెంట్ సేవా సమితి విభాగంలో ఫిబ్రవరి 3వ తేది నుంచి 7వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మొసళ్ల అభయారణ్యంపై విద్యార్థులకు అవగాహన

జైపూర్ : మండలంలోని శివ్వారం శివారులోగల మొసళ్ల అభయారణ్యం ప్రత్యేకతపై స్థానిక అటవీ శాఖ అధికారులు విద్యార్థులకు అవగాహణ కల్పించారు. చెన్నూర్ డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్ ఆశీస్ సింగ్, రేంజ్ ఆఫీసర్ శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఫారెస్ట్ ఆఫీసర్ బాలక్రిష్ణతో కలిసి చెన్నూర్ పట్టణానికి చెందిన కేటీఎస్ పాఠశాల విద్యార్థులు శుక్రవారం మొసళ్ల అభయారణ్యాన్ని సంధర్శించారు. శివ్వారం శివారు రక్షిత అటవీప్రాంతంలో గల గోదావరి నదిలో ఉన్న మొసళ్ల జీవన స్థితిగతులు, ఈ అభయారణ్యంలో సంచరిస్తున్న జీవరాసుల వివరాలును విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా మొసళ్ల సంరక్షణ, అభయారణ్యంలో నివసిస్తున్న ఇతర జీవరాసుల సంరక్షణార్థం శాఖ పరంగా చేపడుతున్న చర్యలు, తీసుకుంటున్న జాగ్రత్తలు వివరించారు. ప్రకృతి ఒడిలో ఇమిడివున్న ఈ ప్రాంతాన్ని రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చిపోవడం, వారి రాకపోకలకు సంబంధించి శాఖ పరంగా చేసిన ఏర్పాట్లు తదితర విషయాలపై అటవీ అధికారులు విద్యార్థులకు వివరించారు.

రూ.11.7లక్షలతో తూములకు మరమ్మత్తులు

- స్థిరీకరించిన విస్తీర్ణానికి సాగు నీరు
- పేరుకుపోయిన పూడిక తీసి నీటి నిల్వలు పెంచాలి : ఆయకట్టు రైతులు



తూము నిర్మించేది ఇక్కడే

నవతెలంగాణ-జైపూర్

భీమారం గ్రామ పంచాయతి కొత్తగూడెం శివారులో సుమారుగా యాభై సంవత్సరాల క్రితం నిర్మించిన కొత్త చెరువుకు నీటిపారుదల శాఖ మరమ్మత్తు పనులు చేపట్టింది. దాదాపుగా 300 ఎకరాల స్థిర విస్తీర్ణానికి సాగు నీటిని అందించేందుకు నిర్మించిన రెండు తూములు చెడిపోవడంతో నీరందటం సమ్యగా మారినట్లు అధికారులు గుర్తించారు. మొదటి తూముకు సంబంధించిన సెటర్ (డోర్) తుప్పుపట్టిపోగా బండరాళ్లతో నిర్మించిన రెండవ తూము శిథిలావస్థకు చేరుకుంది. సాగు నీటికి సతమవుతున్న రైతుల డిమాండ్ మేరకు స్థిరీకరించిన విస్తీర్ణం మొత్తానికి సాగు నీటిని అందించాలన్న లక్ష్యంతో రూ.11.70 లక్షలతో తూముల మరమ్మత్తులతో పాటు అవసరమైన మేరకు గైడ్‌వాల్ నిర్మించేందుకు పనులు చేపట్టారు. గత యాభై సంవత్సరాలుగా మరమ్మత్తుకు నోచుకోని ఈ చెరువుకు సంబంధించిన తూములు నిర్మించడమే కాకుండా పేరుకుపోయిన పూడిక తీయించాలని ఆయకట్టు రైతులు అభ్యర్థిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వార అప్పుడప్పుడు పూడిక తీయడం తప్పా అంతకు మించి ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోలేదని రైతులు వాపోతున్నారు. ఈ చెరువుకు ఎగువన గల పంట పొలాల మీదుగా రక్షిత అటవీ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీటి లభ్యత ప్రతీ ఏటా తగ్గుతుండగా పేరుకుపోయిన పూడిక కారణంగా నీటి నిల్వలు తగ్గుతున్నట్లు తెలుస్తోంది. భారీ వర్షం కురిసినా చెరువు నిండిపోతుండటంతో ఆ తదుపరి ఎన్ని వర్షాలు కురిసినా ఉపయోగం లేకుండాపోతుందని రైతులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో అడపాదడపా కురిసే వర్షాలకు తోడు చెరువులో నిలువైన నీటిని సక్రమంగా వినియోగించుకుంటే తప్పా సాగు చేసిన పంట చేతికందే అవకాశం లేకుండాపోయింది. తూముల నిర్మాణం చేపట్టిన అధికారులు చెరువులో పేరుకుపోయిన పూడిక తీయడంపై దృష్టి సారించాలని కోరుతున్నారు. చెరువులో నీటి నిల్వలు పెంచుకోవడానికి అవకాశం ఉన్నా.. పూడిక విపరీతంగా పెరిగిపోవడం సమస్యగా మారిందని అదికారులు ఈ విషయంలో దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చెరువు నీరు పంట పొలాలకు చేరాలి : ఏఈ అఖిల్

చెరువు నీరు వృథా కాకుండా నేరుగా పంట పొలాలకు చేర్చడం కోసం తూముల మరమ్మత్తులు చేపడుతున్నాం. పెద్ద తూముకు ఏర్పాటు చేసిన షెటర్ తుప్పుపట్టడంతో కొత్తగా సెటర్ ఏర్పాటు చేస్తున్నాము. బండరాళ్లతో నిర్మించిన చిన్న తూము శిథిలమైనందున ప్రస్తుతం అదే స్థలంలో కొత్తగా తూము నిర్మించనున్నాము. వర్షాకాలం వచ్చే లోపు తూములు మరమ్మత్తు పనులు పూర్తి చేసి అవసరమైన మేరకు గైడ్ వాల్ నిర్మించి పంటల సాగుకు ముందే పనులు పూర్తి చేసి ఆయకట్టుకు సాగు నీరు సమకూర్చడం జరుగుతుంది.

పదోన్నతులతో వేతనాల పెంపు

- కేకే-5 గని మేనేజర్ భూశంకరయ్య



నవతెలంగాణ-మందమర్రి

పదోన్నతులతో వేతనాల పెరుగుదలను సింగరేణి కల్పిస్తుందని కేకే-5 గని మేనేజర్ భూ శంకరయ్య తెలిపారు. శుక్రవారం గనిలో పనిచేస్తున్న 94 మందికి జనరల్ మజ్దూర్‌తో పాటు 8 మందికి ట్రామర్లు ఇద్దరు కోల్ కట్టర్లు, ముగ్గురు హాలర్ ఆపరేటర్స్, ఒక మేషన్, ఒక టబ్ రిపేర్ మేస్త్రికి పదోన్నతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఏ సంస్థలో లేని విధంగా సింగరేణిలో మంచి వేతనాలు ఉన్నాయని, విద్యా అర్హతలు ఉన్నవారు కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయని చెప్పారు. గతంలో పదోన్నతులు లభించాలంటే 10 సంవత్సరాలకుపైగా పట్టేదని కానీ ప్రస్తుతం ఒకే సంవత్సరంలో 190 మస్టర్లు చేస్తే ప్రమోషన్ లభిస్తుందని తెలిపారు. సంస్థ ప్రగతి కోసం అధిక ఉత్పత్తి లక్ష్యంగా అందరు అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. ప్రధానంగా ప్రతిరోజు విధిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ పనిచేయడం ద్వారా ఎలాంటి ప్రమాదాలు జరగవని పేర్కొన్నారు. ప్రమాద రహిత ఉత్పత్తికి యాజమాన్యం ప్రాధాన్యతనిస్తోంది తెలిపారు. అధికారులు ఉద్యోగులు అనే తేడా లేకుండా అందరూ రక్షణ సూత్రాలను పాటిస్తూ క్రమశిక్షణతో పని చేస్తే ప్రమాదాలు లేని సంస్థ కావడమే కాకుండా ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలుస్తామని చెప్పారు. జనవరి నెలలో 108 శాతం ఉత్పత్తిని సాధించినందుకు గాను ఉద్యోగులకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం గనికి నిర్దేశించిన రెండు లక్షల టన్నుల ఉత్పత్తి కంటే అదనంగా అనుకున్న దానికంటే ముందుగానే అదనపు ఉత్పత్తిని సైతం సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం మందమర్రి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి నారాయణ, గని రక్షణ అధికారి రమేష్, డిప్యూటీ మేనేజర్ జస్వంత్, సంక్షేమ అధికారి మాస్కుల కార్తీక్, గుర్తింపు సంఘం ఫిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, కంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

60 రోజుల్లో 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం

- రోజు వారీగా 2.3 లక్షల టన్నుల ఉత్పత్తి, రవాణా చేపట్టాలి
- ఏరియా జీఎంలతో సీఎండీ బలరామ్ నాయక్



సమావేశమైన సీఎండీ బలరామ్ నాయక్

నవతెలంగాణ-జైపూర్

ఆర్థిక సంవత్సరంలో నిర్దేషించుకున్న 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి శుక్రవారం సింగరేణి వ్యాప్త ఏరియా జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి, పురోగతి, నూతన ప్రాజెక్టులపై సమీక్షించారు. రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్ గరిష్టంగా ఉంటుందని, ఈ కారణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంతగా బొగ్గు రవాణా చేయాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది నిర్దేషించుకున్న 70 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడంలో మిగిలిన రెండు నెలల కాలంలో 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాల్సిన అవరాన్ని గుర్తు చేశారు. రోజుకు 2.3లక్షల టన్నుల ఉత్పత్తికి తగ్గకుండా ముందుకు పోవాలని సూచించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఉత్పత్తి, రవాణా ఆశాజనకంగా ఉన్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. గడిచిన 10 నెలల కాలంలో 56.7 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా 56.3 మిలియన్ టన్నులను సాధించుకున్నామని తెలిపారు. గత ఏడాదితో పోల్చితే 4 శాతం ఉత్పత్తి శాతం, 6 శాతం రవాణాలో వృద్ధి సాధించుకున్నట్లు వెల్లడించారు. భూపాల్‌పల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో ఉత్పత్తి పెంపుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా ఏరియా జీఎంలను ఆదేశించారు. ఓవర్ బర్డెన్ తొలగింపు కాంట్రాక్టర్లు నిర్దేషిత సంఖ్యలో యంత్రాలను అందుబాటులో ఉంచుకునేలా చూడాలని ఆదేశించారు. అదేవిదంగా వారి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాలనుకున్న ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్, కొత్తగూడెం ఏరియా వీకే కోల్‌మైన్, బెల్లంపల్లి ఏరియాలోని గోలేటీ ఓసీ, ఇల్లందు ఏరియా జీకే ఓసీ గని ప్రారంభానికి కావల్సిన అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

కేవీకేలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం



నవతెలంగాణ-తాండూరు

బెల్లంపల్లిలో కేవీకేలో 7వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విస్తరణ సంచాలకులు సుధారాణి పాల్గొని మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్రానికి నియమించబడిన శాస్త్రజ్ఞులు ప్రాంతాలకు అనుకూలంగా అభివృద్ధి చేసిన పరిశోధనా ఫలాలు ప్రతి ఒక్క రైతుకు చేరుకునేలా ప్రణాళికాబద్ధంగా సాంకేతిక కార్యక్రమాలను రూపొందించాలని తెలిపారు. పొలాస సహ వ్యవసాయ పరిశోధనా సంచాలకులు శ్రీనివాస్ అధ్యక్షతన మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాలలోని కృషి విజ్ఞాన కేంద్రం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు గత సంవత్సరం చేపట్టిన వివిధ పంటలపై చేసిన పరిశోధన అంశాలమీద శాస్త్రజ్ఞులంతా చర్చించారు. రైతులతో అనుభవాలను పంచుకున్నారు. ప్రస్తుత యాసంగిలో రాబోయే వానాకాలం పంటలపై పరిశోధన అంశాల మీద సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు. బెల్లంపల్లి కేవీప ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో వ్యవసాయ సాంకేతికతను రైతులకు మరింత చేరువచేసే విధంగా కృషి విజ్ఞాన కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో కృషి చేస్తుందని ఆయన వెల్లడించారు కార్యక్రమంలో చంద్రశేఖర్, ప్రసాద్, ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజీ) ఆదిలాబాద్, డా. శ్రీలత, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ (అగ్రోనామి), డా.శ్రీధర్ సిద్ధి, సైంటిస్ట్ (ప్లాంట్ బ్రీడింగ్), డా. గోన్యా నాయక్, సైంటిస్ట్ (ప్లాంట్ బ్రీడింగ్ సభ్యులు సుంకర వెంకటేశ్వర రావు, మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారిని కల్పన పాల్గొన్నారు.

ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి



నవతెలంగాణ-జన్నారం

ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని తిమ్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ జాడి గంగాధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో ఐదు సంవత్సరాల సర్పంచ్ పదవి కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామ కార్యదర్శి లావణ్య కార్యాలయ సిబ్బంది వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్యాలయ సిబ్బంది గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను శాలువా పూలమాలలతో సత్కరించారు. అనంతరం గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందించిన, పాఠశాల ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్యకర్తలకు అంగన్‌వాడీ టీచర్లకు, ఉపాధి హామీ సిబ్బందికి ఐకేపీ సిబ్బందికి, అధికారికి మిషన్ భగీరథ సభ్యులకు, గ్రామ పారిశుధ్య కార్మికులకు కార్యదర్శికి, గ్రామంలో నూతనంగా స్పెషలాఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీతకు, ఆశా కార్యకర్త గ్రామ డీలర్ అన్ని శాఖల అధికారులకు గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్ ఉప సర్పంచ్ వార్డు సభ్యుల తో కలిసి శాలువా పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పద్మ వార్డు సభ్యులు, చంద చంద్రయ్య, శిరీష, జాడి వెంకటయ్య, జునుగురి లక్ష్మి, జాడి లక్ష్మి, జాడి రాజన్న, బోర్లకుంట వెంకటమ్మ, కారోబారి శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, ఏఎన్ఎంలు అపరంజి, మాధవి, అంగన్‌వాడీ టీచర్లు జాడి సంజీవరాణి, గంజాయిల జమున ఆశా కార్యకర్త రజిత, ఐకేపీ సీఏ లలిత, ఉపాధి హామీ సీఏ భూమన్న పాఠశాల ప్రాణాలు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఉపాధ్యాయులు, రవీందర్, శ్రీనివాస్, శివాజీ, సుధాకర్, మల్లయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

జైపూర్ : మండలంలోని శివ్వారం గ్రామ పంచాయతి సర్పంచ్‌గా ఐదేండ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న ఆవిడపు గణేష్‌ను గ్రామ పంచాయతి కార్మికులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. గడిచిన ఐదేండ్ల కాలంలో సర్పంచ్‌తో తమకు గల అనుబంధాలను గుర్తు చేసుకున్న కార్మికులు సర్పంచ్‌గా తమ పట్ల చూపిన ఆధరాభిమానాలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపాలురు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతి పాలకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ ఉద్యోగులు, గ్రామస్థులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

తెలంగాణ పునర్నిర్మాణ సభకు తరలిన నాయకులు



నవతెలంగాణ-వేమనపల్లి

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు వేమనపల్లి మాజీ జడ్పీటీసీ నీల్వాయి ఎంపీటీసీ ఆర్.సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో నిర్వహిస్తున్న తెలంగాణ పునర్నిర్మాణ సభకు నాయకులు తరలి వెళ్లారు.

జైపూర్ : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి సభకు జైపూర్, భీమారం మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఉదయం భారీగా తరలివెళ్లారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హెూదాలో మొదటి సారి ఉమ్మడి జిల్లాకు వస్తున్న రేవంత్‌రెడ్డి సభ విజయవంతం కోసం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు స్థానిక నాయకులు పెద్ద మొత్తంలో ప్రజలను తరలించారు. జైపూర్, భీమారం మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన కాంగ్రెస్ మాజీ సర్పంచులు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు వందలాదిగా తరలివెళ్లారు.

రామాలయ నిర్మాణానికి రూ.60వేల విరాళం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ గ్రామంలో నిర్మిస్తున్న రామాలయంకు అదే గ్రామానికి చెందిన అల్లం నరేశ్ రూ.60 వేల విరాళాన్ని శుక్రవారం గ్రామపెద్దలకు అందజేశారు. ఆలయ నిర్మాణంకు తన వంతుగా విరాళం అందజేయడం జరిగిందని దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా తమ వంతుగా సహాయ సహకారాలు అందించాలని అల్లం నరేష్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెమలికొండ ఆశారాజ్, గ్రామ పెద్దలు సుభాష్ రెడ్డి, సత్తుపల్లి సత్యం గోనే సత్యం పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | ఫిబ్రవరి 03, 2024 | www.navatelangana.com

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం ప్రారంభమైన పరీక్షలు కొనసాగాయి. శుక్రవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ జిల్లా కేంద్రంలోని పీటీజీ గిరిజన గురుకుల కళాశాలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో రోజు జిల్లాలో పరీక్ష కోసం 11 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో 1147 మందికి గాను 1053 మంది విద్యార్థులు హాజరయ్యారని, మధ్యాహ్నం సెషన్‌లో 909 మందికి గాను 870 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది శారద, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మార్గ్‌లో డ్రైనేజీని పరిశీలించిన మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-నిర్మల్



పట్టణంలోని ఎన్టీఆర్ మార్గ్‌రోడ్ నెం.07లో డ్రైనేజీ సమస్య దృష్ట్యా శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్ సీవీఎన్ రాజు,సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. డ్రైనేజీ మురుగు నీళ్ల కాలనీ రోడ్డుపై నిల్వ ఉండటంతో ప్రజలకి ఇబ్బందిగా మారిందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే స్పందించి, అత్యవసరంగా సమస్యను పరిష్కరించాలని, సంబంధిత అధికారులకు సూచించారు. చైర్మెన్ వెంట ఏఈ హరిభూవన్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, సిబ్బంది ఉన్నారు.

స్పెషల్ అధికారుల పాలన ప్రారంభం



కౌటలలో ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ నస్రుల్లాఖాన్‌కు పూలమొక్కను అందిస్తున్న జీపీ సిబ్బంది

నవతెలంగాణ-బెజ్జూరు

గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, ఏఓ రాజులనాయుడు, పంచాయతీ రాజ్ ఏఈ మగ్బుల్, ఉద్యానవన శాఖ అధికారి, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి బాధ్యతలు అప్పగించారు. ఒక్కో అధికారికి రెండు నుండి మూడు పంచాయతీలకు బాధ్యతలు ఇవ్వగా వీరంతా శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీల్లో బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం నుండి పంచాయతీల్లో ప్రత్యేక పాలన కొనసాగుతుందని ఎంపీఓ రమేష్‌రెడ్డి తెలిపారు.

కౌటాల : ఫిబ్రవరి 1తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించడానికి ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. కౌటాల ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, ఖనికి, ముత్తంపేట్, శిర్షా గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. నాయిక్ తహసీల్దార్ రవీందర్ గుండాయిపేట్, తాటిపెల్లి, తుమ్మిహేటి, వీర్దండి గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. మండల విద్యాధికారి డి సోమయ్య పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఎంపీఓ మౌనిక బాల్యపెల్లి, తలోడి, నాగపెల్లి గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా విధులు చేపట్టారు. తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి గుడ్లబోరి, మొగడ్‌దగడ్, తాటినగర్ గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా వ్యవహరించనున్నారు. వ్యవసాయ అధికారి రాజేష్ బోదంపెల్లి, గురుడుపేట్, కన్నెపెల్లి జీపీల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఎం సురేందర్ మండలకేంద్రానికి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనున్నట్టు తెలిపారు. ముత్తంపేట్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రత్యేక అధికారికి ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వాంకిడి : సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం అధికారులను నియమించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు స్పెషల్ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా మండలంలోని ఇందాని, కిర్డీ, లేండిగూడ స్పెషల్ అధికారి శివకమార్, డాబా, లొద్దిగూడ, సవాతి గ్రామాలకు శివప్రసాద్, బెండారా, తెగాపూర్, తమేళ గ్రామాలకు శ్రావణ్, చౌపన్‌గూడ, పిప్పర్‌గొంది, పాటగూడ గ్రామాలకు మణుకుమార్, బంబారా, గోయగావ్, సోనాపూర్ గ్రామాలకు ఎండీ రెహిమొద్దీన్, నవెదరి, చిచ్చుపెల్లి, సరండి గ్రామాలకు ఎండీ నజురొద్దీన్, కన్నర్‌గావ్, కమాన, కోమిటీగూడ గ్రామాలకు మిలింద్‌కుమార్, నవెగాం, నవెగూడ, తెదాపూర్ గ్రామాలకు శైలేందర్, జంబుల్‌దరి, లక్ష్మీపూర్, వెల్గి గ్రామాలకు శ్రావణ్‌కుమార్, వాంకిడి ఎస్‌కె రెహిమొద్దీన్ స్పెషల్ అధికారులుగా బాధ్యతలు చేపట్టారు.

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని 28 పంచాయతీలకు 13 మంది ప్రత్యేకాధికారులుగా నియామకమయ్యారు. ఇందులో 11 మంది తమకు కేటాయించిన స్థానాల్లో శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ కిరణ్ పదవీ బాధ్యతలు చేపట్ట లేదు. పశు వైద్యాధికారి విజయ్ కుమార్ తనకు కేటాయించిన పంచాయతీల్లో ప్రత్యేధికారిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ సుముఖంగా లేనట్టు జిల్లా అధికారులకు అభ్యర్థన పంపించినట్టు మండల స్థాయి అధికారి ఒకరు తెలిపారు.



కాగజ్‌నగర్ రూరల్: బాధ్యతలు స్వీకరిస్తున్న అధికారులు

బాధిత కుటుంబానికి డీఎస్పీ చేయూత



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని నవెగాం గ్రామ పంచాయతీలోని టొక్కిగూడ గ్రామానికి చెందిన రాజక్కకు గత సంవత్సరంలో వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి రెండు కండ్లు కోల్పోయింది. శుక్రవారం బాధిత కుటుంబాన్ని మండల పోలీస్‌స్టేషన్‌లో ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ పరామర్శించారు. ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు కుటుంబానికి 30 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రైతులు పంట పొలాలను అడవీ పందులు, ఇతర జంతువుల నుండి రక్షించేందుకు దొంగతనంగా విద్యుత్ తీగలు అమర్చడం వల్ల ఇలాంటి ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. ఇతర అమాయక ప్రజలు వాటి బారినపడి చనిపోయిన సంఘటనలు జిల్లాలో ఉన్నాయన్నారు. ఎవరైన అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళలకు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటాం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలకు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటామని ఆసిఫాబాద్ షీ టీం ఇన్‌చార్జి సునీత అన్నారు. జిల్లా కేంద్రంలోని వాసవి విద్యా మందిర్‌లో బాలికలకు షీ టీం తరపున అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేయాలని, లేదా షీ టీం ఆసిఫాబాద్ 8712670564కు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మహేశ్వర్, షీటీం సభ్యులు, శ్రీలత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం స్కీమ్ వర్కర్ల సమ్మె నోటీసు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) స్కీంలో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులను రేగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దివాకర్, బోగే ఉపేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా వైద్యాధికారికి ఈనెల 16న జరిగే సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పని చేస్తున్న అన్ని రకాల క్యాడర్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పెండింగులో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నెల 16న జరిగే దేశ వ్యాపిత సమ్మెలో ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకు, అర్బన్ ప్రయిమరీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం ఎన్‌హెచ్‌ఎం కార్మికుల క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మధుకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ షకీల్, కార్యదర్శి శ్రీదేవి, అనూష, రజిత, రజిని, ముస్తక్, మాయ, గంగుబాయ్, వెంకటేష్, చంద్రకళ, లింగమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని 33కేవీ రాంపూర్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని రాంపూర్ సబ్ స్టేషన్, జీఎస్ నగర్ సబ్ స్టేషన్, తాంసి సబ్ స్టేషన్, పొన్నారి సబ్ స్టేషన్, తలమడుగు సబ్ స్టేషన్ సంబంధిత ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అన్నారు.

ప్రజలతో మమేకమై పనిచేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రజలతో మమేకమై పోలీసులు పని చేయాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ టౌన్ నూతన సీఐగా బదిలీపై వచ్చిన శంకరయ్య మర్యాదపూర్వకంగా ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ అమలు చేయాలన్నారు. ప్రజలతో మమేకమై పని చేయాలని సూచించారు. ఆపన్న హస్తం కోసం స్టేషన్‌కు వచ్చే వారిపట్ల బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

వసతి గృహాల వార్డెన్‌లు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల వార్డెన్లు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో 10వ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధత ప్రత్యేక ప్రణాళిక నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18 నుండి 29 వరకు 10వ తరగతి వార్షిక పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని తెలిపారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలలో చదివే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా చూడాలని, వసతి గృహాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఇప్పటినుండి 45 రోజుల వరకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని, అల్పాహారం, స్నాక్స్, భోజనం సమయానికి అందిస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వసతి గృహాల సంక్షేమ అధికారులు విద్యార్థులను పాఠశాలలకు సకాలంలో పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, సంక్షేమ అధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతిలో అత్యుత్తమ ఫలితలు సాధించాలి

- జిల్లా విద్యాధికారి రవీంధర్‌రెడ్డి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రవీంధర్‌రెడ్డి

మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పద్యాల్‌ను శుక్రవారం జిల్లా విద్యాధికారి రవీంధర్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో పదో తరగతి ఇంగ్లీష్, తెలుగు మాధ్యమం విద్యార్థులతో ముచ్చటించారు. వార్షిక పరీక్షలపై మార్గనిర్దేశం చేస్తూ, పోటీ ప్రపంచంలో విజతలుగా నిలువాలంటే నిరంతరం శ్రమించాలని అన్నారు. ప్రపంచం విజేతలనే గుర్తిస్తుందిని, పాఠశాల స్థాయి నుంచే శ్రమించే స్వభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రానున్న వార్షిక పరీక్షలలకు పూర్తి సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ గైర్హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు రెగ్యులర్‌గా వచ్చేటట్లు కృషి చేయాలని తెలిపారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భూషణ్, ఉపాధ్యాయ సిబ్బంది, సీఆర్పి సుధాకర్ పాల్గొన్నారు.

నాగోబా అభివృద్ధికి మరింత నిధులు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- నాగోబా అభివృద్ధికి రూ.7 కోట్ల నిధులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన ఆదివాసుల నాగోబా జాతరకు మరింత నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆవరణలో హెలికాప్టర్‌లో మంత్రి కొండ సురేఖతో కలిసి దిగారు. ముందుగా నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు ఆయనకు నాగోబా మోమెంటోను బహూకరించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. నూతన మందిర నిర్మాణంపై మెస్రం వంశీయులను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా గుడి, గోపురాన్ని ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన దర్బార్‌హాలులోకి చేరుకున్నారు. పొదుపు సంఘం మహిళతో మాట్లాడారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో స్వయం ఉపాధి పొందాలన్నారు. పొదుపు సంఘం మహిళకు రూ.10 కోట్లు కేటాయిస్తామని ప్రకటించారు. దీంతో రాబోయే రోజుల్లో వారు పారిశ్రామిక వేత్తలుగా మారాలని కోరారు. నాగోబా అభివృద్ధికి రూ.7 కోట్ల కేటాయిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ముత్నూర్ నుంచి కేస్లాపూర్ వరకు డబుల్ బీటీ రోడ్డుకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలకు, వసతి గృహాలకు పొదుపు సంఘం మహిళల ద్వారానే పిల్లలకు యూనిఫాంలు అందచేసే యోచనలో ఉన్నామన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేత..

జిల్లా అఖిల పక్షం, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీ బండి దత్తాత్రి, లంకా రాఘవుల ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు, ఏజన్సీలోని ఉట్నూర్‌లో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారి వెంట కమిటీ సభ్యులు రమేష్, పూసం సచిన్ ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాగోబా ఆలయ కమిటీ ప్రతినిధులు

తప్పుల్లేకుండా ఓటరు జాబితాను రూపొందించాలి: భారతీలక్‌పతి నాయక్



నవతెలంగాణ-నిర్మల్

ఎలాంటి తప్పుల్లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని, ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు బి.భారతీలక్‌పతి నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రభుత్వశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఓటు హక్కుపై కళాజాతచే ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లాల వారిగా ఫామ్ 6, 7, 8 క్షుణ్ణంగా పరిశీలన చేయాలని అన్నారు. నియోజక వర్గాల వారిగా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 ఫొటో ఓటరు జాబితాపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేసి స్పష్టమైన జాబితా రూపొందించాలన్నారు. 18, 19 సంవత్సరాల వయసు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నూతన ఓటరు నమోదు చేసేందుకు వయసు నిర్ధారణ కొరకు జనవరి1, 2024న ప్రామాణికంగా తీసుకొని, గత నెల 22వ తేదీ వరకు ముసాయిదా జాబితా స్వీకరించి, అభ్యంతరాలు, ఫిర్యాదులను ఫిబ్రవరి 2వ తేదీన పరిశీలించి, 8వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో 1500 మంది ఓటర్లు ఉండేలా జాబితా రూపొందించటంలో రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్లు పరిశీలించాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, ఓటరు నమోదు, జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపుల కొరకు దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించాలని అన్నారు. జిల్లాల్లో 18 సంవత్సరాలు నిండిన వారి వివరాలు ఓటరు జాబితాలో నమోదు చేసి స్పష్టమైన జాబిత రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నూతన ఓటరు నమోదు, సవరణలు, మార్పులు చేర్పులు నిబంధనల మేరకు పకడ్బందిగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి స్పష్టమైన ఓటరు జాబితా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న స్వీప్ యాక్టివిటీస్, ప్రత్యేక ఓటరు జాబితా రివిజన్‌పై చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలపై వివరించారు. ప్రతీ వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కళాశాలలో నోడల్ అధికారినీ నియమించి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో చేపడుతున్న ఫొటో ఓటరు జాబితాపై వివరించారు. అనంతరం జిల్లాల వారీగా 6, 7, 8 ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి, దిశానిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా కలెక్టర్లు హేమంత్ బోర్కడే, బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, శ్యామలదేవి, ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రేపు గురుకుల విద్యాలయాల ప్రవేశపరీక్ష

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ అధికారి పోలోజు బాలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీని కోసం జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల బాలురలో ఎంపీసీ గ్రూపులో428 మంది విద్యార్థులకు, సిర్పూర్ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల బాలురలో బైపీసీ 348 మంది, సిర్పూర్(టి) సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల బాలికల బైపీసీలో 345 మంది, రెబ్బెన సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఎంపీసీ 156 మంది, బైపీసీ 117 మంది హాజరవుతారన్నారు. జిల్లాలో మొత్తం నాలుగు కేంద్రాల్లో 1495 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటలలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు.

పంచాయతీ ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ



వేమనపల్లి

నవతెలంగాణ-జైపూర్

కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండల పరిధిలో గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లుగా వివిధ శాఖలకు చెందిన అధికారులు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. టేకుమట్ల, పెగడపల్లి గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ, ఇందారం, మిట్టపల్లి, నర్వ గ్రామ పంచాయతి స్పెషల్ ఆఫీసర్‌గా ఎంపీఓ అనిల్ కుమార్ బాధ్యతుల స్వీకరించారు. శివ్వారం గ్రామ పంచాయతి స్పెషల్ ఆఫీసర్‌గా మండల వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా మండల పరిధి వివిధ గ్రామ పంచాయతీలకు సంబంధించి స్పెషల్ ఆఫీసర్లుగా నియమితులైన అధికారులు స్థానిక మాజీ సర్పంచుల నుంచి పదవీబాధ్యతలు స్వీకరించారు.

భీమారం మండలంలో..

మండల పరిధిలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులుగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీరించినట్లు స్థానిక ఎంపీడీఓ శ్రీనివాస్ రావు తెలిపారు. నర్సింగాపూర్, ఖాజీపల్లి గ్రామ పంచాయతీ పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆరెపల్లి, మద్దికల్ పంచాయతి అధికారిగా స్థానిక తహసీల్దార్ విశ్వంబర్, భీమారం, పోలంపల్లి పంచాయతి అధికారిగా సతీష్‌రెడ్డి, భూర్గుపల్లి పంచాయతి అధికారిగా రాకేష్ శర్మ, దాంపూర్, ధర్మారం పంచాయతి అధికారిగా అఖిల్, ఎల్కేశ్వరం, కొత్తపల్లి పంచాయతికి క్రిష్ణ పదవీ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.

వేమనపల్లి : సర్పంచుల పదవీ కాలం ముగియడంతో శుక్రవారం వేమనపల్లి మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. వేమనపల్లి, నాగారం ప్రత్యేకాధికారిగా ఎంపీడీఓ అల్లూరి లక్ష్మయ్య. నీల్వాయి, ముల్కల పేట ప్రత్యేకాధికారిగా ఎంపీఓ శ్రీపతి



జైపూర్

బాపురావు.గొర్లపల్లి, రాజారాం ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ మొల్లుమూరి సదానందం, జిల్లెడ, బయ్యారం ప్రత్యేక అధికారిగా మండల వ్యవసాయ అధికారి సోదారి వీరన్న, సుంపుటం, కల్లంపల్లి ప్రత్యేకాధికారిగా డిప్యూటీ తహసీల్దార్ భూక్య గోవింద్ నాయక్, క్యాతనపల్లి, చామనపల్లి ప్రత్యేక అధికారిణిగా వెటర్నరీ ఆసిస్టంట్ సర్జన్ అరుణ, దస్నాపూర్, సూరారం ప్రత్యేక అధికారిగా ఆర్డబ్లుఎస్ ఏఈ నరేష్ బాధ్యతలు స్వీకరించారు.

లక్షెట్టిపేట : లక్షెట్టిపేట మండలంలోని ఎల్లారం గ్రామానికి స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌కి గ్రామ పంచాయతీ సర్పంచ్ పింగిళి శ్రీలత-రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం శుభాకాంక్షలు తెలియచేస్తు గ్రామ పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎల్లారం సెక్రటరీగా పనిచేస్తున్న సుజాత గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా ఉత్తమ కార్యదర్శిగా ఎంపికైన సందర్భంగా కొత్త సుజాతను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుజాత, సర్పంచ్ పింగిళి శ్రీలత-రమేష్, ఉప సర్పంచ్, అనుమండ్ల సత్తవ్వ-రమేష్, వార్డు సభ్యులు పోచన్న, రాజేందర్ కోఆప్షన్ సభ్యులు మెట్టపల్లి రాజారావు, అంగన్‌వాడీ టీచర్ సుధారాణి, సత్యనారాయణ, కారోబార్ రాజమోగిలి పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ అధికారులను నియమిస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇక నుండి గ్రామాలకు సంబంధించిన పనులు ప్రత్యేక అధికారులే పర్యవేక్షిస్తారు. కాగజ్‌నగర్ డీఎల్‌పీఓ సురేష్‌బాబు సిర్పూర్ మేజర్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా, సిర్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఇటికల్‌పహాడ్, వేంపల్లి, నవెగాం, ఎంపీడీఓ రాజేశ్వర్‌కు డోర్‌పెల్లి, కర్జెపెల్లి, అచ్చెల్లి, ఎంపీఓ మహేందర్‌రెడ్డికి హుడ్కిళి, లోనవెల్లి, పారిగాం, మండల వ్యవసాయ అధికారిని మధులతకు లక్ష్మీపూర్, వెంకట్రావ్‌పేట్, చీలపెల్లి, డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్యకు మేడిపెల్లి, భూపాలపట్నం, చింతకుంట గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా నియమించగా వారు బాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను ప్రత్యేక అధికారులకు తెలియజేయాలని సూచించారు.



భీమారం మండలంలో..

జూనియర్ సివిల్ కోర్టును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ పర్యవేక్షించారు. కోర్టు ప్రాంగణంలో ఉన్న వివిధ సముదాయాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుకు వచ్చే కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సిర్పూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్ కుమార్, సీనియర్ న్యాయవాది రైస్‌హైమద్, న్యాయమూర్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే నెంబర్ 38లోని భూసమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 38లోని భూసమస్యలను పరిష్కరించాలని మండల మహిళా అధ్యక్షురాలు జాదవ్ విద్యారాణీ మంత్రి సీతక్కను కోరారు. గురువారం రాత్రి ఇంద్రవెల్లి సీఎం సభ ఏర్పాట్లకు వచ్చిన మంత్రి సీతక్కకు ఆమె వినతిపత్రం అందజేశారు. అధికారులు అనేక సార్లు సర్వే జరిపినప్పటికీ రైతులకు ఇప్పటి వరకు పట్టాలు అందలేదని, రైతులు అనేక సంక్షేమ పథకాలకు అనర్హులుగా ఉన్నారని తెలియజేశారు. కనీసం బ్యాంక్ రుణాలు కూడా అందలేని పరిస్థితులో ఉన్నారని తెలిపారు. దాదాపు పది సంవత్సరాల నుంచి రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటి కైనా ప్రభుత్వం అధికారులు సర్వే నెంబర్ 38లోని రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని మంత్రికి విన్నవించారు.

కాంగ్రెస్ సభకు కదిలిన శ్రేణులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి జిల్లాలోని ఇంద్రవెల్లిలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న తెలంగాణ పునర్నిర్మాణ సభకు జిల్లాలోని శ్రేణులు ప్రత్యేక బస్సులు, ఆర్టీసీ బస్సులు వాహనాల్లో తరలి వెళ్లారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు జిల్లాలో లేకపోవడంతో భూపాల్‌పల్లి ఎమ్మెల్యే శ్రేణుల తరలింపు బాధ్యతలు స్వీకరించారు. అయితే జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ జిల్లా నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలించడానికి వారం రోజులు ప్రణాళిక వేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇంద్రవెల్లి సభకు తరలిన మందికంటే ఎక్కువగా తరలిస్తున్నట్లు వివరించారు. ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, నాయకుల గుండ శ్యామ్, శ్రావణ్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేష్, నాయకులు సెల్వెట్ కార్ బద్దు, రమేష్, శ్రీలత, కల్పన, జాడి గణేష్, రమాదేవి, కల్యాణి, కవిత తరలివెళ్లారు.

మొసల్ల అభయారణాన్ని సందర్శించిన పరిశీలకులు

నవతెలంగాణ-జైపూర్

మండల శివారం సమీపంలోని మొసల్ల అభయారణ్యాన్ని కేంద్రం బృంధం సభ్యులు సందర్శించారు. చెన్నూరు డీఎఫ్ఓ ఆశిష్ సింగ్, ఎఫ్ఆర్ఓ శివ కుమార్, ఎస్ఎస్ఓ బాలకృష్ణ బృంధం సభ్యులకు స్థానిక స్థితిగతులు వివరించారు. మొసల్ల అభయారణ్యం నిర్వహణ తీరు, సమర్థ మల్యాంకనం తదితర అంశాలపై కేంద్ర బృందం పరిశీలించింది. బృంధంలో గుజరాత్ రాష్ట్రానికి చెందిన రిటైర్డ్ పీసీసీఎఫ్ శామ్యూల్ తికదార్, శాస్త్రవేత్తలు డాక్టర్ జాన్సన్, డాక్టర్ అరుణ్ మనీ ఉన్నారు.

స్టాఫ్‌నర్స్ ఉద్యోగం సాధించిన మండల వాసి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలకేంద్రానికి చెందిన గడ్‌చాంద రాజకళ ఇటీవల ప్రకటించిన స్టాఫ్ నర్స్ ఫలితాలలో ప్రతిభ చాటి ఉద్యోగం సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ ప్రభుత్వ ఉద్యోగం సాధించడం హర్షనీయమని గ్రామస్తులు కొనియాడారు. రాజకళ బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియమాక పత్రం అందుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తన విజయానికి భర్త, తమ్ముని సాయం మరువలేనిదని ఆమె తెలిపారు.